రైతుబజారు లేక అవస్థలు



సత్యదేవుని ఆలయంతో కూడిన పాతనగరం

దాబాగార్డెన్స్: పాత నగరంలో రైతు బజారు లేక ఇక్కడి ప్రజలు అవస్థలు పడతున్నారు. ప్రభుత్వాలు, ప్రజాప్రతినిధులు, అధికారులు మారుతున్నా ఎవరూ కరుణ చూపడం లేదు. ప్రభుత్వం సబ్సిడీ రేట్లకు అందించే నిత్యావసర వస్తువులు, కూరగాయలు అందక ఎక్కువ డబ్బులతో కొనాల్సి వస్తోందని స్థానికులు వాపోతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో దక్షిణ నియోజకవర్గ ప్రజలు నిత్యావసర సరకులు, కూరగాయల కొనుగోలుకు ఇతర ప్రాంతాల్లోని రైతు బజార్లను ఆశ్రయించాల్సి వస్తోంది.

ఎక్కువ మంది అల్పాదాయవర్గాల వారే

విశాఖ దక్షిణ నియోజకవర్గంలో ఎక్కువగా నివసించేది బడుగు, బలహీన వర్గాల ప్రజలే. ఉదయాన్నే వెళ్లిపోయి రాత్రికి ఇంటికి చేరే దినసరి కూలీలు, కలాసీలు అధికం. ఆటో కార్మికులు, అల్పాదాయ వర్గాల వారే ఈ ప్రాంతంలో నివాసముంటున్నారు. వీరు రోజంతా కష్టపడితే వచ్చిన డబ్బుల్లో అధిక భాగం వెచ్చించి బహిరంగ మార్కెట్‌లో నిత్యావసర వస్తువులు, కూరగాయలు కొనలేక అవస్థలు పడతున్నారు. ఇటువంటి వారి కోసం నియోజకవర్గ పరిధిలో రైతు బజారు ఏర్పాటు చేయ్యాలని ప్రజాప్రతినిధులను వేడుకున్నా స్పందించలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. విశాఖ తూర్పు నియోజకవర్గంలో త్రీటౌన్ పోలీస్ స్టేషన్ పక్కన, ఎంవీపీ కాలనీలో రైతు బజార్లుండగా, ఉత్తర నియోజకవర్గంలో సీతమ్మధార, నరసింహనగర్, కంచరపాలెం, మర్రిపాలెంలో రైతు బజార్లు నిర్వహిస్తున్నారు. అలాగే పశ్చిమ నియోజకవర్గం, గాజువాక, పెందుర్తిలో రైతు బజార్లు నడుస్తుండగా విశాఖ దక్షిణ నియోజకవర్గంలోనే ఒక్క రైతు బజారు కూడా లేకపోవడం శోచనీయం. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఈ ప్రాంత ప్రజల మనోభావాలు అర్థం చేసుకుని రైతు బజార్ ఏర్పాటు దిశగా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

కంచరపాలెం వెళ్లాల్సి వస్తోంది



మా ప్రాంతంలో ఎక్కడా రైతు బజార్లు లేకపోవడంతో ఐదారు కిలోమీటర్ల దూరంలో ఉన్న కంచరపాలెం రైతు బజార్‌కు వెళ్లాల్సి వస్తోంది. ఆ లాభం ప్రయాణ చార్జీలకే సరిపోతుంది. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి, ఇక్కడి ప్రజల మనోభావాలు అర్థం చేసుకుని రైతు బజార్ ఏర్పాటు చేయాలి.

– ఆర్.గంగాభవానీ, స్థానికురాలు

సబ్సిడీలు అందడం లేదు



ప్రభుత్వం రైతు బజార్ల ద్వారా సబ్సిడీ ధరలకే నిత్యావసర వస్తువులు, కూరగాయలు అందజేస్తోంది. కానీ దక్షిణ నియోజకవర్గ పరిధిలో గల వారెవరూ అర్హులు కానట్టు జిల్లా యంత్రాంగం దృష్టిలో ఉంది. ఇక్కడ రైతు బజార్లు లేకపోవడమే మాకు శాపంగా ఉంది. అధికారులు ఎవరూ ఈ ప్రాంత ప్రజలను పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా రైతుబజారు ఏర్పాటు చేయాలి.

– పసగాడ రామలింగేశ్వరరావు, స్థానికుడు

స్పందించారు.. బతికించారు..



శ్రీనుతో వన్‌టౌన్ పోలీసులు

దాబాగార్డెన్స్: అప్పుల బాధతో ఆత్మహత్యాయత్నం చేసిన ఓ వ్యక్తిని పోలీసులు సకాలంలో స్పందించి కాపాడారు. ఈ ఘటన గురువారం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. శ్రీకాకుళం జిల్లాకు చెందిన మంచిపల్లి శ్రీను బతుకుదెరువు కోసం కొన్నేళ్ల కిందట విశాఖపట్నం వలస వచ్చాడు. పాతనగరంలోని లక్ష్మీటాకీస్ సమీపాన వాడవీధిలో అద్దెకు ఉంటున్నాడు. అప్పులు బాధతో జీవితంపై విరక్తి చెందిన శ్రీను ఆత్మహత్యకు సిద్ధపడ్డాడు. శ్రీను సోదరుడు ఈ విషయాన్ని పోలీసులకు తెలియజేశాడు. వెంటనే వన్‌టౌన్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని శ్రీనుకు కౌన్సిలింగ్ ఇచ్చి గ్రామ పెద్దలకు అప్పజెప్పారు. ప్రాణాలు కాపాడిన పోలీసులకు శ్రీను కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

ప్లాస్టిక్ రహిత నగరంగా తీర్చిదిద్దుదాం



గుడ్డ సంచులను చూపుతున్న జోనల్ కమిషనర్

దాబాగార్డెన్స్: ప్లాస్టిక్ రహిత నగరంగా విశాఖను తీర్చిదిద్దుదాం అంటూ జోన్ – 4 జోనల్ కమిషనర్ శివప్రసాద్ పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణ కోరుతూ 28వ వార్డులో గల ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థులతో గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకం వల్ల భవిష్యత్‌లో మానవ జాతి మనుగడకే ప్రమాదమన్నారు. ప్లాస్టిక్ వాడకంపై ప్రభుత్వం ఇప్పటికే నిషేధం విధించిందన్నారు. వాతావరణ సమతుల్యత కాపాడడం కోసం మొక్కలు నాటాలని, ప్లాస్టిక్ వినియోగాన్ని నివారించాలని కోరారు.

సంపత్ వినాయగర్ హుండీ ఆదాయం లెక్కింపు



నగదు లెక్కిస్తున్న వేంకటేశ్వర సేవా సంఘం సభ్యులు

సీతమ్మధార : ఆశీలమెట్టలో గల సంపత్ వినాయగర్ ఆలయంలో గురువారం హుండీ ఆదాయం లెక్కించారు. 22 రోజులకు రూ.18.04 లక్షలు, 210 మిల్లీ గ్రాముల బంగారం, 95 గ్రాముల వెండి వచ్చినట్లు ఆలయ ఫౌండర్ టి.ఆర్.బోళన్ తెలిపారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ తనిఖీదారులు బి.వసంత కుమార్ పర్యవేక్షణలో నగదు లెక్కించారు. శివజ్యోతి, శ్రీ వెంకటేశ్వర సేవా సంఘం సభ్యులు, సిబ్బంది జి.గోవింద్ రెడ్డి, డీఎస్ ప్రసాద్ అప్పలరాజు పాల్గొన్నారు.

జర్నలిజంలో దిగజారిపోయిన ఎల్లో మీడియా



దుర్గాలమ్మ జంక్షన్ వద్ద నిరసన తెలుపుతున్న కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు, తదితరులు



ఈనాడు దినపత్రిక ప్రతులు దహనం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



ఈనాడు ప్రతులను దహనం చేస్తున్న వైఎస్సార్ సీపీ 35వ వార్డు అధ్యక్షుడు కనకరెడ్డి, తదితరులు



జ్ఞానాపురం బీఆర్‌టీఎస్ రహదారిలో నిరసన తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

దాబాగార్డెన్స్/జగదాంబ/సీతమ్మధార/కంచరపాలెం: ఎల్లో మీడియా ఇంతగా దిగజారిపోవడం దారుణమని, పాఠకులకు ఫైల్ ఫొటోలు చూపి ఇప్పుడే జరిగినట్టు చూపించే స్థాయికి పడిపోవడం సిగ్గుచేటంటూ పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు ధ్వజమెత్తారు. దశాబ్దాలుగా పేపర్ నడుపుతున్న ఈనాడు అధినేత రామోజీరావుపై రాష్ట్ర ప్రజలకు ఎంతో గౌరవం ఉండేదని, ఆ గౌరవమంతా గన్నవరం ఘటనతో పోయిందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని అభాసుపాలు చేయడానికి లేనిపోని నిందారోపణలు చేస్తూ, 2021లో జరిగిన ఘటనకు సంబంధించిన టీడీపీ నేత పట్టాభి ఫొటోను ముద్రించి మొన్న జరిగినట్టు ఈనాడులో ప్రచురించడం చూస్తుంటే రాష్ట్ర ప్రభుత్వాన్ని ఏదోలా టార్గెట్ చేయాలనే ఉద్దేశంతో తప్పుడు కథనాలు వండి వడ్డిస్తున్నట్టు తెలుస్తోందన్నారు. ఈ కథనాలు రాష్ట్ర ప్రజలను మోసగించేవిలా ఉన్నాయని మండిపడ్డారు. గన్నవరం ఘటనలో ఎల్లో మీడియా తీరును నిరసిస్తూ దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ఆదేశాల మేరకు 31వ వార్డు నాయకుడు దొడ్డి బాపూ ఆనంద్ ఆధ్వర్యంలో గురువారం ఎల్లమ్మతోట వద్ద ఈనాడు దినపత్రిక ప్రతులు దహనం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాంబాబు, బాబూరావు, నాయుడు, మోహన్, రమణ, గణేష్, భాష, మహేష్, రాజాబాబు, కర్రి ధనలక్ష్మి, కె.భాను, దుర్గా తదితరులు పాల్గొన్నారు.

- దొండపర్తి ఆర్చి వద్ద వైఎస్సార్‌సీపీ 27వ వార్డు అధ్యక్షుడు నీలాపు సర్వేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈనాడు కథనాలు రాష్ట్ర ప్రజలను మోసగించేవిలా ఉన్నాయని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ అమ్మాజీ, అజయ్‌రెడ్డి, కె.మధు, శివ, పొన్నాడ త్రినాథ్, పెద్దాడ రమణ, శివారెడ్డి, అప్పలరెడ్డి పాల్గొన్నారు.
- అసత్య కథనాలు రాస్తున్న ఈనాడు దినపత్రిక ప్రతులను వైఎస్సార్‌సీపీ 35వ వార్డు అధ్యక్షుడు అలపన కనకరెడ్డి ఆధ్వర్యంలో దహనం చేశారు. గురువారం పూర్ణామార్కెట్ దరి బౌడారా రోడ్డులో ఉన్న వైఎస్సార్‌సీపీ వార్డు కార్యాలయం ఎదుట నిర్వహించిన ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు గండిబోయిన మూర్తి, బత్తుల రాము, అలుపన సంతోష్‌కుమార్‌రెడ్డి, గణేష్, వినోద్, అబీద్, తదితరులు పాల్గొన్నారు.
- ఈనాడు దినపత్రిక తీరును నిరసిస్తూ జీవీఎంసీ 35వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు ఆధ్వర్యంలో గురువారం దుర్గాలమ్మ జంక్షన్ వద్ద వైఎస్సార్ సీపీ నాయకులతో కలసి మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు నాయిన మల్లిబాబు, మంగరాజు, కంటిపల్లి వరలక్ష్మి, వార్డు వర్కింగ్ ప్రెసిడెంట్ గౌరీశంకర్, సిటీ సెక్రటరీ నాయిని రమేష్ రెడ్డి పాల్గొన్నారు.
- టీడీపీ నాయకుడు పట్టాభిరామ్‌ని పోలీసులు కొట్టారని ఈనాడు దినపత్రికలో తప్పుడు వార్త రాసినందుకు నిరసనగా గురువారం జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం బీఆర్‌టీఎస్ రహదారిలో కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ నేతృత్వంలో వైఎస్సార్‌సీపీ నాయకులు నిరసన తెలిపారు. ఈనాడు ప్రతులను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కోడిగుడ్ల శ్రీధర్, వి.వేళంగిణిరావు, తదితరులు పాల్గొన్నారు.

రైతుబజార్‌లో అందుబాటులో కొత్త చింతపండు

ఆరిలోవ: ఎంవీపీ రైతుబజార్‌లో కొత్త చింతపండు అందుబాటులోకి వచ్చింది. ఇంతవరకు ఇక్కడ రైతులు విక్రయిస్తున్న ధర కంటే దీని ధర అధికారులు తక్కువగా నిర్ణయించారు. బజార్‌లో ఏర్పాటు చేసిన జీసీసీ స్టాల్‌లో గురువారం నుంచి కొత్త చింతపండు విక్రయాలు ప్రారంభించారు. పిక్కతో 3 కిలోలు, 5 కిలోల చొప్పున ప్యాకెట్లుగా చేసి వినియోగదారులకు అందుబాటులో ఉంచారు. ఇక్కడ 3 కిలోల చింతపండు ప్యాకెట్ రూ.130, 5 కిలోల చింతపండు ప్యాకెట్ రూ.210గా ధర నిర్ణయించారు. రైతులు విక్రయిస్తున్న చింత పండు కిలో రూ.72 ఉంది. దీంతో వినియోగదారులు జీసీసీ స్టాల్‌లో చింతపండు కొనుగోలుకు ఆసక్తి కనబరుస్తున్నారు.

విజయ వంట నూనె ధరలు ఇలా..

చింతపండుతో పాటు ఇక్కడ ప్రత్యేక కౌంటర్‌లో విజయ వంట నూనెలను అందుబాటులో ఉంచారు. సన్ ఫ్లవర్ నూనె లీటర్ రూ.130, పామాయిల్ లీటర్ రూ.103, వేరు శనగ నూనె లీటర్ రూ.178, రైస్ బ్రౌన్ ఆయిల్ లీటర్ రూ.121 విక్రయిస్తున్నట్లు రైతుబజార్ ఈవో ప్రసాద్ తెలిపారు. ఇక్కడ నూనెలు బయట ధరల కంటే తక్కువగా ఉంటాయన్నారు.

అలరించిన సినీ సంగీత విభావరి



పాటలు పాడుతున్న గాయనీ గాయకులు

సీతంపేట: సాంస్కృతిక రాజధానిగా రూపుదాల్చిన విశాఖలో దివికేగిన సినీ దిగ్గజాల స్మారకార్థం సంగీత కార్యక్రమాలు ఏర్పాటు చెయ్యడం అభినందనీయమని గీతం విశ్వవిద్యాలయం అధ్యక్షుడు ఎం.శ్రీభరత్ అన్నారు. ఆత్రేయ స్మారక కళాపీఠం ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం విశాఖ పౌరగ్రంథాలయంలో కళాతపస్వి కె.విశ్వనాథ్, నేపథ్యగాయనీ వాణీ జయరామ్‌ల స్మారకార్థం సంగీత సాహిత్య సమలంకృతే శీర్షికన నిర్వహించిన సినీ సంగీత విభావరికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విజయ్ నిర్మాణ్ కంపెనీ అధినేత ఎస్.విజయ్‌కుమార్ మాట్లాడుతూ తెలుగు భాషా విలువలను ప్రపంచ స్థాయికి తీసుకెళ్లిన దర్శకుడు కె.విశ్వనాథ్ అని.. జాతీయ స్థాయి గుర్తింపు పొందిన వాణీ జయరామ్‌లు సినీ ప్రపంచానికి దూరం కావడం విచారకరమన్నారు. ఈ సందర్భంగా రమేష్ పట్నాయక్, శ్రీవిద్య పాడిన అందెల రవమిది, శంబర జోగారావు శైలజ పాడిన రేపల్లియ యెద ఝల్లున పొంగిన రవళి, వీకే రాజు శృతి పాడిన రాగాల పల్లకిలో, రాజేంద్రప్రసాద్, కల్యాణి పాడిన ఒక పూల బాణం పాటలు ప్రేక్షకులను అలరించాయి. పాడుతా తీయగా విన్నర్ సార్థక్, లక్ష్మీశైలజ, పి.ఎల్.నాయుడు, కోసూరు రాజు, దీప్తి పలూ హిట్‌సాంగ్స్ పాడి వీనుల విందుచేశారు. కార్యక్రమంలో ఆత్రేయ స్మారక కళా పీఠం ప్రధాన కార్యదర్శి గంటి మురళి, పైడా కృష్ణప్రసాద్, వైభవ్ జ్యూలర్స్ అధినేత్రి గ్రంధి మల్లిక, పువ్వాడ శోభన్ ప్రకాష్, మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ పాల్గొన్నారు.

క్లుప్తంగా



తాడేపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని విశాఖ దక్షిణ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ గురువారం కలిశారు.

కోలా గురువులుకు అభినందనలు



కోలా గురువులుకు శుభాకాంక్షలు తెలుపుతున్న కొల్లి సింహాచలం

దాబాగార్డెన్స్: ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎంపికైన రాష్ట్ర మత్స్యశాఖ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ కోలా గురువులుకు కనకమహాలక్ష్మి దేవస్థానం ట్రస్ట్ బోర్డు చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం అభినందనలు తెలిపారు. గురువారం సాయంత్రం గురువులు నివాసంలో ఆమె మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో 39వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు సలీం, మైలపిల్లి ఆదినారాయణ, ధనరాజు, బంగారి, రవి, వేణు, అనీల్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

మహిళలు స్వశక్తితో ఎదగాలి



సర్టిఫికెట్ అందిస్తున్న కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు

జగదాంబ: మహిళలు స్వశక్తితో ఎదగాలని జీవీఎంసీ 35వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు అన్నారు. వైశాఖి కళాంజియ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన కుట్టు మిషన్, బ్యూటీషియన్ శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదపీట వేస్తున్నారన్నారు. సొసైటీలు, ట్రస్టులు కూడా మహిళల అభ్యున్నతికి కృషి చేయాలన్నారు. అనంతరం శిక్షణలో ఉత్తీర్ణులైన 50 మంది బ్యూటీషియన్లు, కుట్టుమిషన్ శిక్షణ పూర్తి చేసుకున్న 50 మందికి సర్టిఫికెట్లను భాస్కరరావు అందజేశారు.

ఎర్నిమాంబ హుండీ ఆదాయం రూ.13.04 లక్షలు



దబ్బులు లెక్కిస్తున్న సిబ్బంది

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురంలో గల ఎర్నిమాంబ అమ్మ వారి ఆలయంలో గురువారం దేవాదాయ శాఖ సిబ్బంది, శ్రీహరి స్వచ్ఛంద సేవకులు హుండీల ఆదాయం లెక్కించారు. 44 రోజులకు అమ్మవారి దర్శనాలకు సంబంధించి హుండీల ఆదాయం రూ.13,04,903లు వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి డీవీఎస్ సురేష్ బాబా తెలిపారు. దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ పీవీఎల్ నరసింహం, లక్ష్మీనరసింహం లక్ష్మీనారాయణ పర్యవేక్షణలో ఆదాయాన్ని లెక్కించారు.

ఎరుకమాంబ అమ్మవారికి సారె



అమ్మవారి సారెను వీధుల్లో ఊరేగిస్తున్న మహిళలు



అమ్మవారి పాదాల చెంత సారె

సీతమ్మధార : దొండపర్తిలో వెలసిన ఎరుకమాంబ అమ్మవారికి స్థానికులు తొలిసారిగా సారె పెట్టారు. స్థానిక మహిళలు అరిసెలు, చలివిడితోపాటు పలు రకాల స్వీట్లను నెత్తిన పెట్టుకుని పుర వీధుల్లో ఊరేగించారు. అనంతరం అమ్మవారికి నివేదించి పసుపు కుంకుమతో పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేశారు. కార్యనిర్వాహణాధికారి రమాబాబు, అర్చకుడు శ్రీనివాసరావు పూజలు చేశారు.

ఘనంగా అమ్మవార్ల జాతర



పోలమాంబ, భూలోకమాంబ, కొత్తమాంబ

దాబాగార్డెన్స్: జీవీఎంసీ 37వ వార్డు కొత్త జాలారిపేట మత్స్య పారిశ్రామికుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బీచ్‌రోడ్డు నేవల్ క్వార్టర్స్ ఎదురుగా వెలసిన పోలమాంబ, భూలోకమాంబ, కొత్తమాంబ, గంగమ్మల తృతీయ జాతర మహోత్సవం గురువారం అత్యంత వైభవంగా నిర్వహించారు. కొత్త జాలారిపేట, పెయిందొరపేట తదితర మత్స్యకార గ్రామాల ప్రజలు అమ్మవారికి పసుపు నీళ్లు, పాలతో పెద్ద ఎత్తున అభిషేకం నిర్వహించి అమ్మవారికి మొక్కులు సమర్పించుకున్నారు. సాయంత్రం 6 గంటల నుంచి వివిధ సంఘాలచే భజన కార్యక్రమాలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా భక్తి సంగీత విభావరి, చిన్నారులచే నృత్య ప్రదర్శన చేపట్టారు. అమ్మవార్లను విశాఖ పార్లమెంట్ సభ్యుడు ఎంవీవీ సత్యనారాయణ, రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్, ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్, అక్కరమాని విజయనిర్మల, మత్స్యకారుల డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, ఎమ్మెల్సీ అభ్యర్థి కోలా గురువులు, ఫిషింగ్ హార్బర్ మేనేజ్‌మెంట్ బోట్ యూనియన్ అధ్యక్షుడు వాసుపల్లి జానకీరామ్, కార్పొరేటర్లు చెన్నా జానకీరామ్, మహ్మద్ సాధిక్, కోదూరు అప్పలరత్నం తదితరులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి 8 గంటలకు నిర్వహించిన లంకాధినేత రావణాసురుని దహన కార్యక్రమం పలువురిని ఆకర్షించింది. గ్రామ కులపెద్ద నొల్లు మురళీకృష్ణ, గ్రామ పూజారి చింతపల్లి జెంబు, వాడమదుల పెంటయ్య మాస్టారు, చింతపల్లి జెంబు బాబు, చింతపల్లి అయ్యప్పరాజు, ఒలిశెట్టి కుర్లయ్య, గొండ్లు గణేష్ తదితరులు పాల్గొన్నారు.

అబ్బురపరిచిన మ్యాజిక్ ప్రదర్శనలు



వేడుకలో పాల్గొన్న నగరానికి చెందిన మెజీషియన్‌లు



మ్యాజిక్ చేస్తున్న చిన్నారి

దాబాగార్డెన్స్: ప్రఖ్యాత ఇంద్రజాలికుడు పీసీ సర్కార్(సీనియర్) 110 జయంతిని పురస్కరించుకుని ప్రపంచ ఇంద్ర జాలికుల(మెజీషియన్స్) దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశాఖ మెజీషియన్స్ అసోసియేషన్ నిర్వహించిన మ్యాజిక్ ప్రదర్శనలు నగర వాసులను అబ్బురపరిచాయి. దాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రం వేదికగా నిర్వహించిన ఈ ప్రదర్శనలను తాజ్ గేట్‌వే జనరల్ మేనేజర్ గోపాల్, కనకమహాలక్ష్మి దేవస్థానం ట్రస్ట్‌బోర్డ్ సభ్యుడు నందూరి సుబ్రహ్మణ్యం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 20 మంది మెజీషియన్లు చేపట్టిన ప్రదర్శన అద్భుతంగా ఉందన్నారు. అనంతరం విశాఖ మెజీషియన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జేవీజీ సురేష్, కార్యదర్శి అక్తర్ హుస్సేన్ మాట్లాడుతూ 2016 నుంచి ఏటా సర్కార్ జయంతి రోజున ఓ పండగలా ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

అదృశ్యమైన వ్యక్తి బంధువులకు అప్పగింత



తప్పిపోయిన వ్యక్తితో హార్బర్ సీఐ శోభన్‌బాబు, సిబ్బంది

జగదాంబ : హార్బర్ పోలీస్ స్టేషన్ పరిధి వేదాంత కంపెనీ యార్డు వద్ద వ్యాగన్‌లో కనిపించిన వ్యక్తిని కుటుంబ సభ్యులకు పోలీసులు అప్పగించారు. ఈ నెల 21న వ్యాగన్ శుభ్రం చేస్తుండగా ఓ వ్యక్తి నిద్రిస్తున్నట్లు గుర్తించిన సెక్యూరిటీ సూపర్‌వైజర్ నాయుడు సీఐఎస్ఎఫ్ సిబ్బందికి తెలియజేశాడు. వెంటనే వారు హార్బర్ పోలీసులకు సమాచారం అందించడంతో సీఐ శోభన్‌బాబు సదరు వ్యక్తిని విచారించారు. అతని వద్ద ఉన్న ఆధార్‌కార్డు, ఫోన్ నంబరు ఆధారంగా మేఘాలయ రాష్ట్రానికి చెందిన వ్యక్తిగా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వారు రావడంతో గురువారం ఉదయం అప్పగించారు.

సిరులతల్లికి ఘనంగా సహస్ర తులసిపూజ



సహస్ర తులసి పూజలో సిరులతల్లి

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి గురువారం సహస్ర తులసిపూజ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. అలాగే త్రికాల పంచామృతాభిషేక సేవలోనూ పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. పై ప్రత్యేక పూజలో పరోక్ష పద్ధతిలో పాల్గొనేందుకు ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, పలు వురు ధర్మకర్తలు, ఏఈవో వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.